నిధులు ఫుల్.. అభివృద్ధి నిల్!

- అభివృద్ధికి అమడ దూరంలో భీమవరం పట్టణం
- పట్టణంలో పనులు శూన్యం
- చేసిన పనులకు బిల్లులు చెల్లించని కూటమి ప్రభుత్వం
- ఏటా పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు వసూలు
- గత ప్రభుత్వంలో మొదటి ఏడాది రూ.10 కోట్ల పనులు


భీమవరం టూటౌన్‌లో జంట కాలువల వద్ద గోతులతో ఉన్న రోడ్డు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణం అభివృద్ధికి నోచుకోవడం లేదు. పట్టణంలో ఎక్కడ కూడా సివిల్ పనులు జరగడం లేదు. ఆదాయం అద్భుతంగా ఉన్న అభివృద్ధిలో దూరంగా ఉంటుంది. గడిచిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో అక్కడక్కడ అరకొర పనులు తప్ప పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు మాత్రం జరగలేదు. ఏడాది కాలంలో కేవలం రూ. కోటి రూపాయలకు మించి అభివృద్ధి పనులు చేయలేకపోయారు. పట్టణంలో రోడ్లు డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. పట్టణంలో పలుచోట్ల రోడ్లు గోతులమయంగా మారాయి. ఏడాది పాలనలో రోడ్ల నిర్మాణం, డ్రెయిన్ల నిర్మాణాలు సక్రమంగా జరగలేదు. భీమవరం హౌసింగ్ బోర్డ్, సత్యవతి నగర్, పీపీరోడ్లు, ఇండస్ట్రియల్ ఏరియా, చిన్న రంగని పాలెం, ప్రకాష్ నగర్, అమ్మ రాజీవ్ నగర్, చిన్న అప్పారావు తోట తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ముందుకురాని కాంట్రాక్టర్లు

భీమవరంలో సివిల్ పనులు చేయడానికి అధికారులు టెండర్లు పిలుస్తున్న కాంట్రాక్టర్లు మాత్రం ఆ పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. గతంలో పనిచేసిన పనులకు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన పనులకు బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో కొత్త పనులు చేసే పరిస్థితిలో కాంట్రాక్టర్లు లేరు. దాంతో భీమవరం పట్టణంలో డబ్బు లు ఉండి కూడా అభివృద్ధి పనులు చేయలేకపోతున్నారు. పట్టించుకోవాల్సిన కూటమి ప్రభుత్వం భీమవరం మున్సిపాలిటీని గాలికి వదిలేసింది.

గత ప్రభుత్వంలో మొదటి ఏడాది రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

గత ప్రభుత్వంలో ఏడాది కాలంలో రూ. 10 కోట్ల రూపాయలు పనులు చేయడం జరిగింది. జగన్ ప్రభుత్వం పాలన ప్రారంభించిన మొదటి రోజు నుంచే భీమవరం మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే గత టీడీపీ ప్రభుత్వంలో తీర్మానం చేసిన, శంకుస్థాపన చేసి ఆగిపోయిన పనుల సైతం ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని పూర్తి చేశారు. పట్టణంలోని డ్రెయిన్లు, సీసీ రోడ్ల అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని పనులు చేశారు. ఇక నాలుగేళ్ల కాలంలో పట్టణంలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. దాదాపు రూ.130 కోట్లతో భీమవరంలో అభివృద్ధి పనులు చేయడం జరిగింది. ఆ అభివృద్ధి పనులు నేటికి కనిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి పాలనలో పట్టణంలో అభివృద్ధి శూన్యంగా కన్పిస్తుంది.

విస్సాకోడేరు లేఅవుట్ ప్రధాన రహదారి అధ్వానం

భీమవరం మున్సిపాలిటీకి సంబంధించి ఇళ్ల నిర్మాణం జరుగుతున్న విస్సా కోడేరు లేఅవుట్ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. లేఅవుట్ లోపలికి వెళ్లాలంటే ఈ రహదారి ఒక్కటే మార్గం. అలాంటి రహదారి మట్టితో గోతులమయంగా ఉంది. దాంతో లోపలికి ఎటువంటి వాహనం వెళ్లే పరిస్థితి లేక అక్కడివారు గోతుల రోడ్డులో అర కిలోమీటర్ నడిచి వెళ్లడానికి నరకం చూస్తున్నారు. వేసవికాలంలో ఈ రోడ్డు నిర్మాణం చేసి ఉంటే లబ్ధిదారులకు కనీసం లే అవుట్‌లోకి వెళ్లే సౌకర్యం ఉండేది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం వర్షాకాలంలో నాలుగు చినుకులు పడితే చాలు ఈ రోడ్డు మట్టిమయంగా మారిపోతుంది.

> **రోడ్ల నిర్మాణం చేపట్టాలి**
>
> 
>
> విస్సాకోడేరు లేఅవుట్‌కి వెళ్లి మెయిన్ రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. వర్షం పడితే ఎటువంటి వాహనం లోపలికి వచ్చే పరిస్థితి లేదు. లేఅవుట్‌లో ఇల్లు నిర్మాణం చేసుకునేవారికి బయటినుంచి మెటీరియల్ తెచ్చుకోవడానికి వాహనాలు లోపలికి రాక ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపట్టాలి. – బి రాజు, లబ్ధిదారుడు


భీమవరంలో అధ్వానంగా ఉన్న డ్రెయిన్


అధ్వానంగా ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్ వెనుక రోడ్డు


అధ్వానంగా ఉన్న విస్సాకోడేరు లేఅవుట్ రోడ్డు

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

ఉండి: కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని నిర్మలా ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదలచేశారు. గురువారం సాయంత్రం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీశ్రేణులంతా తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

దొడ్డనపూడి ఉపసర్పంచ్‌గా శ్రీనివాస్

కాళ్ల: మండలంలోని దొడ్డనపూడి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా కుంకుట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రస్తుత ఉపసర్పంచ్ కొప్పర్తి ఏసురాజు తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీని పూర్తి చేసేందుకు డిప్యూటీ ఎంపీడీఓ ఎంవీ భాస్కరరావు బుధవారం ఉదయం సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పదో వార్డు సభ్యుడు కుంకుట్ల శ్రీనివాస్ ని మిగతా వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఉపసర్పంచ్ గా ఎన్నుకున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ స్పష్టం చేశారు. ఉపసర్పంచ్ గా ఎన్నికైన శ్రీనివాస్‌ను సర్పంచ్ కొల్లి సుబ్బారావు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్ తదితరులు అభినందించారు.

సొసైటీని అభివృద్ధి పథంలో నడపాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న చిన్న నరసింహరాజు

కాళ్ల: సొసైటీని అభివృద్ధి బాటలో నడపాలని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని కలవపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకారం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి సత్యనారాయణ సమక్షంలో త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మంతెన చిననరసింహారాజు, సభ్యులుగా పెన్మెత్స జానకిరామరాజు, వాతాడి రామారావు బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ సీఈఓ కనుమూరు నరసింహారాజు(మణి), మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, జీవీ నాగేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాతరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం


కలెక్టర్ నాగరాణిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యోగ బాధ్యత వృత్తి ధర్మాన్ని పాటిస్తే ప్రజా మన్నన అవార్డులు పొందగలుగుతామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ (ఒడిఒపి) అవార్డు అందుకున్న కలెక్టర్ నాగరాణిను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, వెంకటేశ్వర స్వామి దేవస్థాన అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అభినందించి సత్కరించారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

భీమవరం: తన భార్య కన్పించడం లేదంటూ భీమవరం పట్టణం బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న పోతుల లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ శేషావతారం బుధవారం చెప్పారు. వివరాల ప్రకారం భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన లక్ష్మణరావు భార్య దుర్గాభవాని పిల్లతో కలసి పట్టణంలోని బ్యాంక్ కాలనీలో నివాసముంటున్నారు. వారం రోజులు క్రితం భార్య మరొక వ్యక్తితో చనువుగా ఉండడంతో లక్ష్మణరావు మందలించాడు. దీంతో మంగళవారం రాత్రి నుంచి తన భార్య కనిపించడం లేదని భర్త లక్ష్మణరావు పోలీసులను ఆశ్రయించాడు.

రాత్రికి రాత్రి షాపుల తొలగింపు


యనమదుర్రు డ్రెయిన్‌కు ఆనుకుని ఉన్న షాపులు తొలగిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని ప్రకాశం చౌక్ సెంటర్ యనమదుర్రు డ్రెయిన్‌కు ఆనుకుని రైల్వే ట్రాక్ వైపు ఉన్న షాపులను పోలీసు సహకరంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమణల పేరట బుధవారం రాత్రికి రాత్రి తొలగింపు పనులు చేపట్టారు. మాకు రాత్రికి సమయం ఇవ్వండి మహ ప్రభో అని షాపుల వారు అధికారులను, పోలీసులు వేడుకున్న కనికరం చూపకుండా వస్తువులు, మెటిరియల్ పనికి రాకుండా తొలగించారు.

ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం


పోటీల్లో ప్రతిభ చూపించిన వారికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాలకోడేరు: ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని మోగల్లు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మేధస్సు నైపుణ్యాన్ని పెంపొందించే క్విజ్, డ్రాయింగ్ రీల్ ప్లే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎంపీ త్రినాథులు మాట్లాడుతూ విద్యార్థుల తమ భవిష్యత్‌ను బంగారు బాటగా చేసుకోవాలంటే చిన్నతనం నుంచి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ ట్రైనర్, ఆటోమేటిక్ ట్రైనర్ బాలరాజు, ఉపాధ్యాయులు కమల కుమారి, సాయి ప్రసాద్, వనుం వెంకట్ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలున్న కోర్సులను ఎంపిక చేసుకోవాలి


ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూట్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ నాగరాణి

భీమవరం: విద్యార్థులు కోర్సుల ఎంపికలో పక్కవారిని అనుకరించకుండా ఉద్యోగ అవకాశాలున్న కోర్సులను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. బుధవారం భీమవరం పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ముందుగా సీఎస్ఆర్ ఫండ్స్ రూ. 5.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం నాగరాణి మాట్లాడుతూ కష్టపడి చదివితే ఏ కోర్సులోనైనా ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఇటీవల కాలంలో ఇంజనీరింగ్ కోర్సులపై మక్కువతో ఎక్కువమంది వాటిలో చేరి ఉద్యోగ అవకాశాలు రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మహోన్నత ఆశయంతో మూర్తిరాజు స్థాపించిన కళాశాలలకు తన వంతు సాయం అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన, నేత్ర వైద్యుడు యువి రమణరాజు, అధ్యాపకులు ఎస్ లక్ష్మీకాంతం, పి అరవిందస్వామి, కె శ్రీనివాసరావు, జి ఉమామహేశ్వరి, డివివి సిహెచ్ సత్యనారాయణ, జి ప్రసాదబాబు, ఎల్ నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు


లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకా వేస్తున్న దృశ్యం

ఆకివీడు: ఆవులకు, ఆవు దూడలకు లంపీ స్కిన్ వ్యాధి(మచ్చలు) వచ్చి మృత్యువాత పడుతున్నాయని, వాటికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారిణి కెల్లా భార్గవీ సత్య చెప్పారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ వైరస్ వ్యాధి పశువుల్లో అధికంగా వస్తుందని, ముందుగా ఆవులకు వస్తుందని చెప్పారు. జ్వరం, శరీర భాగాల్లో బొబ్బలు, నోటిలో పుండ్లు, ఆహారం తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, నడవలేకపోవడం, జాయింట్ల వాపులు, వ్యాధి తీవ్రతరమైతే శ్వాస కోశ ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో ఈ వ్యాధిని అరికట్టవచ్చనన్నారు. టీకాలు వేయించాలని, వ్యాధి లక్షణాలు కన్పిస్తే పశువైద్యాధికారుల్ని సంప్రదించాలని సూచించారు. అజ్జమూరులో గురువారం టీకాలు వేస్తామని స్పష్టం చేశారు.

19న సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఉండి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19న ఉదయం 10గంటలకు 18వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా నిర్వహించే మండల ప్రజావేదిక సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎంవీ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో 2024-25 ఏడాదికిగానూ ఆయా గ్రామాల్లో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులు, సామాజిక భద్ర తా పింఛన్లపై ఏపీఎస్ఎస్ఏటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ, ఆయా గ్రామ సభల్లోని నివేదికలను ప్రిసైడింగ్ అధి కారి సమక్షంలో చదివి వినిపించి, వాటిపై చర్చిస్తారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధి కూలీలు, రైతులు ప్రజలు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆకివీడు: మండలంలోని చినకాపవరం విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో చెట్లు, కొమ్మలు తొలగించేందుకు గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పెదకాపవరం, చినకాపవరం, క్షత్రియపురం, గ్రామాల్లో విద్యుత సరఫరా ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు, ఆక్వా రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల అభ్యంతరాలను పరిష్కరిస్తాం


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

కాళ్ల: జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా మండలంలోని కోలనపల్లి, సీసలి, కోపల్లె, పెదమిరం, వేంపాడు, తదితర గ్రామాల రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం తాహసిల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ జరిపారు. భూ సేకరణ పై జూన్ 14న అభ్యంతరాలు గడువు ముగిసేనాటికి వచ్చిన 54 అభ్యంతరాల పై బుధవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డు అలైన్మెంట్ తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, తమ భూములు వ్యవసాయేతర భూములుగా మార్పు చెందినందున నష్టపరిహారం చదరపు గజాల్లో లెక్కించి ఇవ్వాలని రైతులు కోరగా వ్యవసాయేతర భూములుగా మార్చిన ధ్రువపత్రాలను దాఖలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. అనంతరం పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. జాతీయ రహదారి భూ సేకరణకు ఒక అభ్యంతరం లేదని, నిబంధనల మేరకు మాకు కొంచెం లాభసాటిగా ఉండేలా చూడాలని రైతులు కోరారు. సమావేశంలో ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ సుందర్ సింగ్, జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, డీటీ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని విజయవంతం చేయాలి

భీమవరం(ప్రకాశంచౌక్): సహజంగా లభించే సౌర శక్తిని వినియోగించుకొని ఎటువంటి కాలుష్యం లేని సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ఏపీఈపీ డీసీఎల్ సిబ్బంది విజయవంతం చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. వనజ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉచితంగా లభించే సౌరశక్తిని వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తిని సాధించడానికి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ నరహరిశెట్టి వెంకటేశ్వరరావు, ఏడీఈలు కొత్తపల్లి రాంబాబు, టి. వెంకట్రావు, యు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలేకరిపై ఫిర్యాదు

భీమవరం (ప్రకాశంచౌక్): హేలాపూరి న్యూస్ జర్నలిస్టుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాలోని తహసీల్దారులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ నాగరాణికి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మికి బుధవారం వారి ఛాంబర్లలో విడివిడిగా కలిసి ఫిర్యాదులు అందజేశారు. ఇటీవల హేలాపూరి న్యూస్ జర్నలిస్టుగా చెప్పబడే కాకర విజయప్రసాద్ అనే వ్యక్తి పాలకొల్లు మండలంలో పాలకొల్లు రూరల్ గ్రామ పంచాయతీలో వేయబడిన లేఅవుట్ల విషయంలో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని ఫోన్ ద్వారా బెదిరిస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. అతడి క్రిమినల్ కేసులపై విచారణ జరిపి తహసీల్దార్లు, కిందిస్థాయి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం


భీమవరంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి జ్యోతి


భీమవరంలో బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

భీమవరం: మధ్యవర్తిత్వం చేసేసమయంలో కేసు రాజీ పడినా లేకున్నా గోప్యత పాటించాలని, రాజీ పడితే రాజీ షరతులు నమోదు చేయాలని భీమవరం రెండోవ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి అన్నారు. మధ్యవర్తిత్వంపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం భీమవరం మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదుల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో మధ్యవర్తిత్వం ద్వారానే కేసులు ఎక్కువగా పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మీడియేషన్ న్యాయవాదులు స్టీఫెన్ బాబు, హరి, విజయలక్ష్మి, ప్యానల్ న్యాయవాదులు సురేష్‌కుమార్, అంబేద్కర్, సుధీర్, జ్యోతి, భవాని, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం బైక్ ర్యాలీ

మధ్యవర్తిత్వంపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడంలో భాగంగా బుధవారం భీమవరంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. భీమవరం పోక్సో జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ బి లక్ష్మీనారాయణ పాత కోర్టుల ప్రాంగణం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి సురేష్‌బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి హనీష, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.